నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
8 | ఖమ్మం, శనివారం 24 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

# ఎన్నికల హామీలు నెరవేర్చాలి

**పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలి: టీఎస్‌యూటీఎఫ్**



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

బోనకల్లు, మే 23: పోరాటాలతోనే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, డీఎస్సీ-2024 ఉపాధ్యాయులకు నియామక తేదీని అక్టోబర్ 10గా పరిగణించాలని, డీఎస్సీ-2008 టీచర్లకు జీతాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్ డీఏలతోపాటు పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల పెంపుదలకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు సద్దాబాబు, మండల అధ్యక్షుడు చిన్నరంగారావు, ఉపాధ్యక్షుడు పి.గోపాలరావు, కోశాధికారి జె.కోటయ్య, మండల కార్యదర్శులు పి.నరసింహారావు, కె.సురేశ్, ఉయ్యాల రామారావు, ఎం.నిర్మల, కె.పద్మావతి, ఎం.నరేంద్రసింహ, యు.గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

# పాత డిజైన్ ప్రకారమే కాల్వలు నిర్మించాలి

**సీతారామ పిల్లర్ పరిశీలనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని**



సీతారామ కాలువ వద్ద కూలిన పిల్లర్‌ను పరిశీలించి మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ములకలపల్లి, మే 23: సీతారామ ప్రాజెక్టు కాల్వ నిర్మాణ పనులు పాత డిజైన్ ప్రకారమే నిర్మించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. మాదారం, పూసుగూడెం గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో పాస్ వే పిల్లర్ కూలిన ప్రాంతాన్ని సీపీఎం బృందంగా కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు కాల్వల నిర్మాణం పూర్తికాకుండానే సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది ముందే ప్రారంభోత్సవం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మొదటి ప్లాన్ ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6.75 లక్షల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, సత్యనారాయణ, కొండబోయిన వెంకటేశ్వర్లు, ముదిగొండ రాంబాబు, పాకాల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# జేఏసీ పోరాటంలో పాలుపంచుకోవాలి

**పీఆర్‌టీయూ సమావేశంలో సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు**



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు

బోనకల్లు, మే 23 : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ నిర్వహించే పోరాటాల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. రావినూతల పాఠశాలలో శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడిబాటలో విద్యార్థుల నమోదు పెంచడానికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తుందన్నారు. త్వరలోనే ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు ఉంటాయని, మెరుగైన పీఆర్సీ, పెండింగ్ డీఏల సాధన కోసం సంఘం తరఫున తమవంతు కృషి చేస్తామన్నారు. సంఘం మండల నాయకులు రత్నకుమార్, రెబ్బ శ్రీనివాసరావు, మోతుకూరి మధు, కొమ్ము శ్రీనివాసరావు, సీహెచ్.రవికుమార్, కనకంచి మోహన్‌రావు, మద్దినేని వెంకటేశ్వరరావు, తిరునగిరి స్వామి, గుడిమళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# యువత అన్ని రంగాల్లో ముందుండాలి

**గిరిజన యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీలో భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు**



గిరిజన యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

దమ్మపేట, మే 23: ప్రస్తుత పోటీ ప్రపంచంలో గిరిజన యువత అన్ని రంగాల్లో ముందుండాలని, ఇందుకోసం తమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలు, యువత కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నట్లు గుర్తు చేశారు. దమ్మపేట మండలం పూసుకుంటలో ఉన్న 12 మంది యువకులకు దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఎస్పీ చేతులమీదుగా శుక్రవారం డ్రైవింగ్ లైసెన్స్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గిరిజన యువత క్రీడల్లో రాణించేందుకు పోటీలు నిర్వహించడం, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు ఉచిత కోచింగ్ ఇప్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహనాలు నడిపే గిరిజన యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోవడంతో పలుమార్లు పోలీసులకు పట్టుబడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని వారికి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువతకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించనున్నట్లు తెలిపారు. అనంతరం పూసుకుంట గ్రామ యువతను వారి గ్రామ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దమ్మపేట ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

**వృత్యంతర శిక్షణ పరిశీలనలో ఖమ్మం డీఈవో సామినేని సత్యనారాయణ**




శిక్షణలో మాట్లాడుతున్న ఖమ్మం డీఈవో సత్యనారాయణ

తల్లాడ, మే 23: బడిబాటలో భాగంగా ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంపునకు కృషి చేయాలని ఖమ్మం డీఈవో సామినేని సత్యనారాయణ కోరారు. తల్లాడ జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సందర్శించిన డీఈవో.. ఉపాధ్యాయులకు తగిన సూచనలు సలహాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరాన్ని ఎన్‌రోల్‌మెంట్ ఇయర్‌గా ప్రకటించిందన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు తమవంతుగా విద్యార్థులను పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎంఈవో ఎన్.దామోదర ప్రసాద్, ఎంఎన్‌వో పీ.నరసింహారావు, ఆర్పీలు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీలు పాల్గొన్నారు.

# సర్కారుపై నమ్మకం లేకనే బీఆర్‌ఎస్‌లోకి..


- కాంగ్రెస్ అబద్ధపు హామీలు నమ్మి మోసపోయామంటున్న ప్రజలు
- గుంటుపల్లి గోపవరంలో చేరికల సందర్భంగా జడ్పీ మాజీ చైర్మన్



గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం, మే 23: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారుపై ప్రజలకు నమ్మకం లేకనే స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు అన్నారు. గుంటుపల్లి గోపవరంలో మాజీ సర్పంచ్ కోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం కోట వెంకటేశ్వర్లు, కొండూరి రామకృష్ణతోపాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అలవిగాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. ఇప్పుడిప్పుడే వాస్తవాలు అర్థమవుతున్నాయని, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీని గద్దె దింపి బీఆర్‌ఎస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ నేతలు అబద్ధాలు మానుకొని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అత్యధిక పంచాయతీలను కైవసం చేసుకునేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు యన్నం శ్రీనివాసరెడ్డి, శీలం కవిత, శ్రీకాంత్‌రెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, సాంబశివరావు, మల్లికార్జున్‌రెడ్డి, మందడపు నరేశ్, పెనుగొండ రవి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

'దినదినగండం నూరేళ్ల ఆయుష్షు' అన్న చందంగా ఉంది '104' సంచార ఆరోగ్య వాహనాల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో చేరిన ఉద్యోగుల దుస్థితి. ఫార్మసీ, ఏఎన్ఎం కోర్సులు పూర్తిచేసిన వారిని '104' సంచార వాహనాల్లో వైద్యారోగ్య సేవలందించేందుకు 2008లో ఔట్ సోర్సింగ్ ద్వారా విధుల్లోకి తీసుకున్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.. 2010లో వైద్యారోగ్య శాఖ పరిధిలోకి తీసుకుంది. అలా పదేళ్లపాటు పనిచేసిన తరువాత కరోనా మహమ్మారి ఉగ్రరూపం దాల్చింది. సగం వేతనాల చెల్లింపులు, ఉద్యోగాల తొలగింపులు ఉధృతంగా జరుగుతున్న ఆ సమయంలో అప్పటి కేసీఆర్ సర్కారు వారిని చేరదీసింది. వివిధ ఆసుపత్రుల్లో సర్దుబాటు చేసింది. కానీ.. ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం.. అందరు ఉద్యోగుల మాదిరిగానే '104' పూర్వ ఉద్యోగుల మీద కూడా కనికరాన్ని మరిచింది. గడిచిన ఆరు నెలలుగా వారి వేతనాల విడుదలనూ మరిచింది. దీంతో ఒకటీ రెండు నెలలపాటు అప్పలతో నెట్టుకొచ్చిన ఆ ఉద్యోగుల కుటుంబాలు.. ఇప్పుడు ఆకలితో అలమటించాల్సిన దయనీయ స్థితికి వచ్చాయి. మొత్తంగా వీరిని అప్పటి కాంగ్రెస్ పనిలోకి తీసుకుంటే.. ఇప్పటి కాంగ్రెస్ పస్తులుంచే స్థితికి తీసుకొచ్చింది. -భద్రాద్రి కొత్తగూడెం, మే 23 (నమస్తే తెలంగాణ)



ఆర్నెల్లుగా జీతాలు రావడంలేదంటూ డీఎంహెచ్‌వోకు మొర పెట్టుకుంటున్న '104' ఉద్యోగులు

# 'పస్తుల' పాపం కాంగ్రెస్‌దే..

**అప్పటి కాంగ్రెస్ పనిలోకి తీసుకుంది.. ఇప్పటి కాంగ్రెస్ పస్తులుంచుతోంది**

- దినదిన గండంగా '104' వాహనాల ఉద్యోగుల బతుకులు
- 2008లో ఔట్ సోర్సింగ్ ద్వారా నియమించుకున్న అప్పటి ప్రభుత్వం
- 2010 తర్వాత వైద్యారోగ్య శాఖలో పనిచేయించుకున్న 'హస్తం' సర్కారు
- 'కోవిడ్'లో చేరదీసి ఆసుపత్రుల్లో సర్దుబాటు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- తరువాత వచ్చి ఆరు నెలలుగా పస్తులుంచుతున్న రేవంత్ ఏలుబడి
- పూట గడవక ఆకలితో అలమటిస్తున్న '104' ఉద్యోగుల కుటుంబాలు
- భద్రాద్రి కొత్తగూడెంలో దయనీయంగా 58 మంది ఉద్యోగుల స్థితి

వైద్యశాఖలో ఉద్యోగం చేయాలనే మక్కువ కలిగిన కొందరు.. 2008కి పూర్వమే ఉమ్మడి రాష్ట్రంలో ఫార్మసీ, మిడ్‌వైఫరీ కోర్సులు చేశారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ప్రైవేటు ఏజెన్సీ ద్వారా వీరిని ఫార్మాసిస్టులుగా, ఏఎన్ఎంలుగా నియమించుకుంది. 108 వాహనాల విజయవంతం తరువాత సంచార వైద్య సేవలు అందించేందుకు 104 వాహనాలను తీసుకొచ్చిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ వాహనాల్లో వీరికి విధులు అప్పగించింది. అప్పుడు విధుల్లో చేరిన వారిలో ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో 58 మంది ఉన్నారు. అయితే, '104' వాహనాల్లో సంచార వైద్య సేవలకోసమంటూ ఔట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా వీరిని నియమించుకున్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.. 2010 తరువాత వైద్యారోగ్యశాఖలోకి కూడా వీరిని తీసుకొని అక్కడ కూడా వీరి సేవలను వినియోగించుకుంది. తరువాత సుమారు పదేళ్లపాటు వారు సక్రమంగానే విధులు నిర్వహించారు. ఈ క్రమంలో ప్రపంచ మానవాళిని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి తెలంగాణలోనూ విజృంభించింది. ఆ సమయంలో ప్రభుత్వం కూడా ప్రభుత్వరంగ ఉద్యోగులకు నెలకు సగం వేతనమే చెల్లిస్తూ వచ్చింది. ప్రైవేటు రంగంలో తొలగింపులూ భారీగానే జరిగాయి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపులు కూడా గణనీయంగా జరుగుతున్న పరిస్థితులవి. కానీ.. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అందరు ఉద్యోగులతోపాటు ఈ '104' పూర్వ ఉద్యోగుల విషయంలోనూ ఎంతో సానుభూతితో వ్యవహరించింది. వీరి తొలగింపుల జోలికి వెళ్లకుండా వీరిని వివిధ ఆసుపత్రుల్లో సర్దుబాటు చేసింది. అక్కడ వారి సేవలను వినియోగించుకుంది. వేతనాలనూ సమయానుకూలంగా అందించింది.

## వేతనాల్లేక ఆరు నెలలు..

ఈ క్రమంలో సరిగ్గా ఏడాదిన్నర క్రితం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒకప్పుడు తాము పనిలోకి తీసుకున్న '104' వాహనాల పూర్వ ఉద్యోగుల విషయంలో కనీస మానవీయతనూ ప్రదర్శించలేదు. కొన్ని నెలలపాటు పరవాలేదనిపించినా.. గడిచిన ఆరు నెలలుగా కనీసం వేతనాలు కూడా విడుదల చేయడం లేదు. ఔట్ సోర్సింగ్ విధానంలో చాలీచాలని వేతనాలతో కుటుంబాలను వెళ్లదీసుకునే ఈ ఉద్యోగులు.. ఒకటీ రెండు నెలలపాటు అప్పోసప్పో చేసి పూట గడుపుకున్నారు. కానీ.. నెలల తరబడి చెల్లింపులు చేయకపోవడంతో ఆయా దుకాణాల యజమానులు కూడా ఉద్దెరను కొనసాగించకపోవడంతో వీరి కుటుంబ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి కనికరం లేని కారణంగా గడిచిన ఆరు నెలలుగా ఆయా కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ముంచుకొచ్చింది.



## భద్రాద్రి జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో 58 మంది..

కరోనాకు ముందు వరకూ ఒకే చోట పనిచేసిన వీరంతా.. కరోనా తరువాత సర్దుబాట్లలో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో పనిచేయాల్సి వచ్చింది. అప్పటి పరిస్థితులను బట్టి, వారి ఉపాధిని కాపాడాలన్న అప్పటి ప్రభుత్వ సంకల్పాన్ని బట్టి ఆయా ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో అటెండర్లుగా, సెక్యూరిటీ గార్డుగా, ల్యాబ్ టెక్నీషియన్లుగా, ఫార్మాసిస్టులుగా, ఏఎన్ఎంలుగా, డ్రైవర్లుగా సర్దుబాటు అయ్యారు. భద్రాద్రి జిల్లాలో 58 మందిగా ఉన్న వీరు.. గత ఆరు నెలలుగా తమకు వేతనాలు అందని విషయాన్ని కలెక్టర్ సహా సంబంధిత శాఖల ఉన్నతాధికారులకూ విన్నవించుకున్నారు. కానీ.. సర్కారు విడుదల చేయకుండా నాన్చుతుండడంతో ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు.

### వేతనం అందకుండా ఎలా పనిచేయాలి?



ప్రభుత్వ ఉద్యోగులకైతే వేతనం ఎక్కువగా ఉంటుంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా వారికి వేతనాలు అందుతాయి. ఒకవేళ ఒకటీ రెండు నెలలు రాకున్నా వారికి సర్దుబాటు చేసుకోగలరు. కానీ.. మాలాగ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో చిరుద్యోగులుగా చేస్తున్న మాకు ఆరు నెలలుగా వేతనం రాకుండా ఎలా పనిచేయాలి? వేతనాలు లేకుండా కుటుంబాలను పోషించుకోవడం ఎంత కష్టమో మా ఇళ్లకు వచ్చి చూస్తే తెలుస్తుంది.

**-డీ.రవికుమార్, ఫార్మాసిస్టు, సులానగర్ పీహెచ్‌సీ**

### ఆర్నెల్లుగా జీతాల్లేక నరకం అనుభవిస్తున్నాం..



ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక నరకం అనుభవిస్తున్నాం. అప్పుల సమయం దాటిపోయి పస్తులుండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. బడ్జెట్ వచ్చినా కూడా ప్రభుత్వం మా వేతనాలను విడుదల చేయడం లేదు. మరి మా కుటుంబాలను ఎలా బతికించుకోవాలి. నెల వచ్చేసరికి పాలకు, సరుకులకు, కరెంటు బిల్లులకు, కుటుంబ పోషణకు చెల్లింపులు చేసుకోవాలి కదా?

**-ప్రసాద్, ఫార్మాసిస్టు, ఎర్రగుంట పీహెచ్‌సీ, అన్నపురెడ్డిపల్లి**

### వాళ్లకు బడ్జెట్ లేటుగా వస్తుంటుంది..



ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బడ్జెట్ లేటుగా వస్తుంటుంది. వచ్చినప్పుడల్లా ఆపకుండా వెంటనే బిల్లు చేస్తాం. గడిచిన ఆరు నెలలుగా వీరికి వేతనాలు రాని మాట వాస్తవమే. ఇటీవలే అన్నపురెడ్డిపల్లిలో ఆయా ఉద్యోగులు నన్ను కలిశారు. వేతనాలు రాని విషయం గురించి చెప్పారు. ఈ క్రమంలో మేం కూడా ఇటీవలే బిల్లులు చేశాం. రేపుమాపో జీతాలు వస్తాయి. ఏజెన్సీ ద్వారా చెల్లింపులు జరుగుతాయి.

**-భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో, భద్రాద్రి**

# నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

**టాస్క్‌ఫోర్స్ అధికారులు, డీలర్ల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం, మే 23 (నమస్తే తెలంగాణ): సాగు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ డీలర్లకు సూచించారు. నకిలీ విత్తనాలను అరికట్టే చర్యల్లో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఇన్‌పుట్ డీలర్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీలర్లు పాటించాల్సిన విధి విధానాలు, విత్తన చట్టాలు, నిబంధనలు, అమ్మకాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు వ్యాపారులు విధిగా బిల్లుపై సంతకం చేసి ఇవ్వాలన్నారు. డీలర్లు దుకాణాలకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, డీసీవో సయ్యద్ ఖుర్షీద్, డీహెచ్‌ఎస్‌వో కిషోర్, డీఏవో బాబురావు, జిల్లా అధికారులు, డివిజన్ ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.




అధికారులు, డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, చిత్రంలో ఎస్పీ, అదనపు కలెక్టర్లు









# ప్రధాన రహదారా? ఇసుక లారీల అడ్డానా?

- ప్రతినిత్యం పద్మవ్యూహం
- మణుగూరులో కిలోమీటర్ల మేర భారీ బారులుగా ఇసుక లారీలు
- నిత్యం ట్రాఫిక్ అంతరాయం.. అంబులెన్స్ రాకపోకలకూ ఆటంకం..

మణుగూరు – పినపాక మార్గం ఆసాంతం ప్రధాన రహదారిగా కాకుండా ఇసుక లారీల అడ్డాగా కన్పిస్తోంది. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం కోసం నిర్మించిన ప్రధాన రోడ్డు మార్గాన్ని ఇసుక లారీలు అమాంతంగా ఆక్రమించాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు చివరికి ప్రమాదాలకు గురికావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చివరికి ప్రాణాధారమైన అంబులెన్సుల రాకపోకలకు కూడా తీవ్రమైన ఆటంకాన్ని కలిగిస్తున్న ఆ మార్గం.. నిత్యం ప్రమాదభరితంగా పరిణమించింది. ఈ చిత్రాలే ఇందుకు నిదర్శనంగా కన్పిస్తున్నాయి. ప్రాణాపాయ స్థితిలో నిమిషాల వ్యవధిలో చేరుకోవాల్సిన అంబులెన్స్ వాహనం కూడా రెండు గంటలపాటు ఈ ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకొని కొట్టుమిట్టాడిందంటే అతిశయోక్తి కాదు. పినపాక నియోజకవర్గ కేంద్రమైన మణుగూరులోని రామానుజవరం, సాంబాయిగూడెం ఇసుక ర్యాంపులకు వెళ్లి వచ్చేందుకు మణుగూరు – పినపాక మార్గంలో ప్రధాన రహదారి వెంబడి శుక్రవారం కూడా కిలోమీటర్ల మేర నిలిచి ఉన్న ఈ ఇసుక లారీలే.. ట్రాఫిక్ తీవ్రత కారణానికి ప్రధాన సాక్ష్యాలు.

-మణుగూరు టౌన్, మే 23